క్లుప్తంగా

జీయన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు జీయన్న మఠానికి తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు



జెడ్.రాగంపేటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

గండేపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు కోరారు. మండలంలోని జెడ్.రాగంపేటలో శనివారం కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు ఎన్నికల్లో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎసై ఎన్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానానికి పట్టువస్త్రాల సమర్పణ



సీఎంఆర్ అధినేత వెంకటరమణ సమర్పించిన వస్త్రాలను పరిశీలిస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విశాఖపట్నానికి చెందిన సీఎంఆర్ వస్త్ర దుకాణం అధినేత మావూరి వేంకటరమణ రూ. 80 వేలు విలువ చేసే 18 జతల పట్టు చీరలు, పంచెలను శనివారం సమర్పించారు. ఈ నెల 9న జరిగే ఉగాది వేడుకలు, 17న జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో సత్యదేవుడు, అమ్మవార్లకు, క్షేత్రపాలకులు సీతారాములకు, వనదేవతలు శ్రీవనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు ఈ పట్టు వస్త్రాలు అలంకరించాలని దాత కోరినట్లు ఏఈఓ కృష్ణారావు తెలిపారు. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ, అర్చకుడు సుధీర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెహరా వీరభద్రరావు మృతి



బెహరా వీరభద్రరావు (ఫైల్)

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు బెహరా వీరభద్రరావు (75) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన పెదశంకర్లపూడి సొసైటీ ఉపాధ్యక్షుడిగా, గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యుడిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరభద్రరావు వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుల అనుచరుడు. ఆయన మృతికి జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

ప్రత్తిపాడు: భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ప్రత్తిపాడులో శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గంటా బాలుదొర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. నేషన్ ఫస్ట్-పార్టీ నెక్స్ట్-సెల్ఫ్ లాస్ట్ అనే నినాదంతో బీజేపీ ముందుకు పోతుందన్నారు. చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ శింగిలిదేవి సత్తిరాజు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, పార్టీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, కందా వీరస్వామి, రెడ్డి లోవరాజు, చింతాకుల రామకృష్ణ, ఊటా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారులో సారా స్థావరాలపై శనివారం జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని గీసాల రమణను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టండి

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- అటికెవానిపాలెంలో ఎన్నికల ప్రచారం



అటికెవానిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో మళ్లీ గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని అటికెవానిపాలెంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలన తమ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలు అందించడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్నాన్నారు. ప్రభుత్వంపై అక్కసుతోనే వలంటీర్ల సేవలను నిలిపి వేయించారన్నారు. మళ్లీ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వలంటీర్ల సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వలంటీర్లు అధైర్యపడవద్దన్నారు. ప్రతి పక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు మెసపోవద్దన్నారు. తమ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫాన్స్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుర్తి పార్వతి, ఉప సర్పంచ్ అటికె వీర్రాజు, ఎంపీటీసీ సభ్యురాలు లంక సత్యవతి, పార్టీ మాజీ అధ్యక్షుడు పోతల రమణ, పార్టీ మండల కార్యదర్శి కోసుల కృష్ణ, నాయకులు చింతల వెంకటరమణ, చిటికెల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

తుని: తొండంగి మండలం పైడికొండ శివారు అనూరుకు చెందిన సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేశారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం అనూరు బీసీ కాలనీకి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ నరిశే వీరాస్వామి, ఎంపీటీసీ సభ్యుడు జక్క వరలహాలబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దాడిశెట్టి రాజా నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని మంత్రి రాజా సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి దొరబాబు, కాసిందేవుల శ్రీనివాస్, ఆర్.త్రిమూర్తులు, యు.వరహాలు, నక్కా చంటిబాబు, దేవుళ్లు, పి.రాంబాబు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ



వెదురుపాకలో విగ్రహాలను ఆవిష్కరించిన ఆధ్యాత్మికవేత్తలు

గోకవరం: ఆధ్యాత్మికపరంగా, విద్యాపరంగా గురువులు చేప్పే మాటలు ఆచరణీయమని ఆధ్యాత్మిక వేత్తలు పెద్దింటి గోవర్ధనరంగాప్రసాద్, మర్ల ప్రభాకర సోమయాజుల శర్మ అన్నారు. మండలంలోని వెదురుపాకలో ఆధ్యాత్మిక వేత్త పాల్వంచ తిరుమల వీరవెంకట నరసింహాచార్యులు, ఉపాధ్యాయుడు కొటికలపూడి నారాయణమూర్తి విగ్రహాలను శనివారం వారు ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక, ఉపాధ్యాయ రంగాల్లో వారు చేసిన సేవలను కొనిడాయారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



కొంతంగిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: అర్హులందరికీ పథకాలు అందించిన సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని కొంతంగి, మండపం పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెం, కొండ గౌరంపేట గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టీడీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు దూడల రామస్వామి, ఈగల విజయదుర్గ, కూనిశెట్టి మాణిక్యం, ఎంపీటీసీ దడాల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల అప్పారావు, పర్వత వివేక్, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, వెలుగుల రవి, దూడల శివ, నేమాల సత్తిబాబు, బత్తిన శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



వీరవరంలో తోట నరసింహాన్ని కలసిన భూపాలపట్నం వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని భూపాలపట్నం మాదిగ పేటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం లంక చంటిబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం వీరవరంలో తోట నరసింహం, తోట రాంజీలను మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని తోట నరసింహం వారికి సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, బేరి బాబ్జీ, అరబోలు వాసు, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



కృష్ణునిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం సతీమణి వాణి

గోకవరం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను చూసి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి కోరారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
పార్టీ శ్రేణులతో కలిసి కృష్ణునిపాలెం, వెంకటాపురం, రాంజీపురం, రామన్నపాలెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు పార్టీతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహం, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చిన్నబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, నాయకులు సుంకర వీరబాబు, రౌతు జోగేశ్వరరావు, సుంకర వెంకటరమణ, బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సోషల్ మీడియా కో కన్వీనర్ ఇజ్జిన కిరణ్, అంబటి ప్రసన్న అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం



బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, తోట రాంజీ

కిర్లంపూడి: అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందడంతో పాటు ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ ఆధ్వర్యంలో బూరుగుపూడిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సునీల్, రాంజీ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా సేవలందిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని అభ్యర్థించారు. అనంతరం తోట నరసింహం బూరుగుపూడి చేరుకుని పార్టీ విజయానికి తీసుకోవలసిన కార్యాచరణపై వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, వైస్ ఎంపీపీ పాతంశెట్టి సత్యవతి, ముత్యాల శ్రీనివాస్, పాతంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు భద్రి, హరిబాబు, బత్తుల వెంకన్న, కొల్లిమల్ల సత్తిబాబు, కరెడ్ల నాగేశ్వరావు, జోకా శ్రీను, తోట అయ్యన్న, దాడి చినబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తిరుమాలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. మండలంలోని తిరుమాలిలో శనివారం పోలీసు, రెవెన్యూ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే ఆధారాలు చూపాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ప్రత్తిపాడు: ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని జేఎన్‌టీయుకే ప్రొఫెసర్ మురళీకృష్ణ సూచించారు. ప్రత్తిపాడులో శనివారం జరిగిన ఓ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని వెలిసి తీసి తర్ఫీదు నిస్తే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రతి విద్యార్థి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అఖిల్ స్కూల్ కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్, ప్రిన్సిపాల్ లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల అభివృద్ధే లక్ష్యం

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- సిరిపురంలో ఎన్నికల ప్రచారం



సిరిపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: అక్కచెల్లెమ్మల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వరుపుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జూరి సూర్యనారాయణ, అల్లం ఆదినారాయణ, పీతల నూకరాజు, తోము సూర్యుడు, సాదే లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం



తుని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్ మల్లిక్, చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజలకు సంక్షేమ ఫలాలు నిరంతరం అందాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు దాడిశెట్టి శంకర్ మల్లిక్ పిలుపునిచ్చారు. తుని 13వ వార్డులో శనివారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. తుని పట్టణంలో రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, పార్కులు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించారన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా ఐదేళ్లలో అన్ని రంగాల్లోనూ తుని నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. ప్రతిపక్షాలు చెబుతున్న మాయ మాటలను నమ్మితే మనమే మోసపోతామన్నారు. ప్రజలకు మంచి జరిగింది కాబట్టే వైఎస్సార్ సీపీకి ఓటు వేయమని ధైర్యంగా అడుగుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, నాయకులు పోతుల లక్ష్మణ్, సత్యనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదలకు మేలు



మల్లిసాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం కోడలు శ్రీనిధి అన్నారు.
మండలంలోని మల్లిసాలలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహం, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాలిపిరెడ్డి సత్తిబాబు, నక్కా రాజు, వీరబాబు, వట్టూరి చిట్టిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక

మల్లిసాల గ్రామానికి చెందిన పెయింటింగ్ అసోసియేషన్ కార్యవర్గంతో పాటు 15 మంది సభ్యులు అత్తులూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి తోట శ్రీనిధి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెయింటింగ్ అసోసియేషన్ సభ్యులు గోర్త సతీష్ కుమార్, మరికి అశోక్, గంపల విజయ భాస్కర్, సాగరపు సంజా, పైడిమల్ల అనిల్ పాల్గొన్నారు.


మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా




రేఖవానిపాలెంలో పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



పాతకొట్టాంలో రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు



పెరుమాళ్లపురం సచివాలయం వద్ద రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు



యర్రయ్యపేటలో పంచాయతీ కార్యదర్శి రాజబాబుకు రాజీనామా పత్రాలు అందించిన వలంటీర్లు

తుని రూరల్: మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రేఖవానిపాలెం, లోవకొత్తూరు, కుమ్మరిలోవ, రాపాక గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. దీంతో ఇప్పటివరకూ రాజీనామా చేసినవారి సంఖ్య 230కి చేరిందని ఎంపీడీఓ ఎస్.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇంటింటికి వెళ్లి సేవలు అందించామన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అవ్వాతాతలు, దివ్యాంగులకు పింఛన్లు అందించామన్నారు. ప్రస్తుతం ఎన్నికల వేళ తమ సేవలను ప్రతిపక్ష నాయకులు అడ్డుకోవడాన్ని నిరశిస్తూ రాజీనామాలు చేసినట్టు తెలిపారు. వలంటీర్ల రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తామని పంచాయతీ కార్యదర్శులు టీవీవీ సత్యనారాయణ, రాజబాబు, ఎస్‌వీ ఆదిత్య, రామన్నదొర తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తొండంగి: గ్రామ వలంటీర్ల సేవలపై టీడీపీ ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. శనివారం మండలంలోని యర్రయ్యపేట పంచాయతీలో 19 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రాజబాబుకు అందజేశారు. పెరుమాళ్లపురం పంచాయతీ పరిధిలో 53 మంది, కోదాడ పంచాయతీలో ఏడుగురు వెరసి మొత్తం 79 మంది రాజీనామాలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

49 మంది వలంటీర్ల రాజీనామా

కోటనందూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 49 మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వలంటీర్ల సేవలపై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంతో మనస్తాపం చెంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. మండలంలోని పాతకొట్టాంలో 20 మంది, కొత్తకొట్టాంలో 17 మంది, కేఏ మల్లవరంలో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేయడంతో పాటు 50 కుటుంబాలకు ప్రభుత్వ సేవలు అందించే భాగ్యం కలిగిందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వలంటీర్ వ్యవస్థపై విషం చిమ్ముతూ ఈసీకి ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. టీడీపీ నేతల తీరుకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా, దాడిశెట్టి రాజాను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తే పథకాలు యథావిధిగా కొనసాగడంతో పాటు తామకు ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు.